క్లుప్తంగా

పినపాకలో ఎగిరిన కాంగ్రెస్ జెండా

బూర్గంపాడు: పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు తమ సమీప బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావుపై ఘన విజయం సాధించారు. నియోజవర్గంలోని ఏడు మండలాలలో ఆయనకు ఓటర్లు బ్రహ్మరథం పట్టారు.

పినపాక నియోజకవర్గం ఏర్పడిన దగ్గర నుంచి పినపాక నియోజకర్గంలో మూడుసార్లు కాంగ్రెస్, ఒకసారి వైఎస్సార్‌సీపీ విజయం సాధించాయి. కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంకు ఉన్న ఈ నియోజకవర్గంలో అభ్యర్థి ఎవరైనా విజయం మాత్రం కాంగ్రెస్ పార్టీదేనని మారోసారి నిరూపితమైంది. 2009లో కాంగ్రెస్ నుంచి రేగా కాంతారావు విజయం సాధించారు. 2014లో పొత్తులలో భాగంగా పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పోటీ చేయకుండా మిత్రపక్షం సీపీఐకి టిక్కెట్ కేటాయించింది. ఈ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేసిన పాయం వెంకటేశ్వర్లు విజయం సాధించారు. 2018లో మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రేగా కాంతారావు విజయం సాధించారు. ఆ తరువాత ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి వరకు బీఆర్ఎస్‌లో పాయం వెంకటేశ్వర్లు కాంగ్రెస్‌లో చేరారు. 2023 ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పాయం వెంకటేశ్వర్లు గతంలో ఎన్నడూ లేని విధంగా 34,129 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు.

ఏజెన్సీలో ముమ్మర తనిఖీలు

చర్ల: మావోయిస్టు పార్టీ పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. డిశంబర్ 2 నుంచి 8 వరకు పీఎల్‌జీఏ 23వ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలంటూ మావోయిస్టుకు పలు కమిటీలు పిలుపున్చిన సంగతి విధితమే. వారోత్సవాలకు పిలుపునిచ్చిన మావోయిస్టులు ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులకు నష్టం కలించడంతో పాటు విధ్వంసాలకు దిగవచ్చునన్న నిఘా వర్గాల సమాచారంతో ఇప్పటికే సరిహద్దు అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ ఆపరేషన్‌ను చేపట్టారు. పోలీసులు సరిహద్దు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదార్లపై మోహరించి ముమ్మరంగా తనిఖీలను నిర్వహిస్తున్నారు. ఆయా మార్గాల మీదుగా వచ్చి పోయే వారిని నిశితంగా తనిఖీ చేస్తూ వారి వివరాలను సేకరిస్తున్నారు. మావోయిస్టులు నిర్వహించే వారోత్సవాలకు ఎవరైనా వెళ్తున్నారా, ఏయే గ్రామాల నుంచి వెళ్తున్నారు అనే అంశాలపై పోలీసులు కూపీ లాగుతున్నారు. ఎస్పీ వినీత్, ఏఎస్పీ పంకజ్ పరితోజ్ ఆదేశాల మేరకు సీఐ రాజగోపాల్ నేతృత్వంలో పెద్ద ఎత్తున తనిఖీలు, కూంబింగ్ ఆపరేషన్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

'నోటా'కే ఓట్లు ఎక్కువ!

అశ్వారావుపేటరూరల్: ఎన్నికల బరిలో రాజకీయ పార్టీలు నిలబెట్టే అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు నచ్చని సందర్భంలో 'నోటా'కు ఓట్లు వేసి తిరస్కరించేలా ఎన్నికల సంఘం అవకాశాన్ని కల్పించిన సంగతి తెలిసిందే. దీని కోసం ఎన్నికల సంఘం అభ్యర్థులతోపాటు చివరిలో నోటా కూడా పెట్టింది.

తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అశ్వారావుపేట నియోజకవర్గంలో 14 మంది అభ్యర్థులు పోటి చేయగా, వీరిలో సగం మంది(ఏడుగురు)కి నోటా కంటే తక్కువగా ఓట్లు రావడం గమనార్హం. ఓట్ల లెక్కింపుల్లో 'నోటా'కు 1362 ఓట్లు నమోదయ్యాయి. అయితే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఊకే రవికు 855 ఓట్లు, కన్నెబోయిన వెంకట నర్సింహకు 177, అంగోతు కృష్ణకు 231, ఊకే ముక్తేశ్వరరావుకు 418, కుంజా నాగమణికు 484, తంబాల రవికు 922, బీసీవై పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎం.వెంకటముత్యంకు 676ఓట్లు మాత్రమే వచ్చాయి. వీరందరి కంటే నోటాకే అధికంగా ఓట్లు రావడం చర్చనీయశంగా మారింది.

హోరాహోరీగా ఫలితాలు

- అశ్వారావుపేట, మణుగూరులో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం
- భద్రాచలంలో బీఆర్ఎస్ ఆధిక్యతతో విభిన్న తీర్పు
- పోస్టల్ బ్యాలెట్‌లో మూడు చోట్లా కాంగ్రెస్ హవా..



భద్రాచలం: విజయం అనంతరం కౌంటింగ్ కేంద్రం వద్ద వెంకట్రావ్, అనుచరులు విజయ సంకేతం

భద్రాచలం నియోజకవర్గంలో..

భద్రాచలం/భద్రాచలంఅర్బన్: భద్రాచలం గడ్డపై తెల్లం వెంకట్రావ్ బీఆర్ఎస్ తరుపున విజయం సాధించారు. ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్యకు 47,533 ఓట్లు పోలవ్వగా.. బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావ్‌కు 53,252 ఓట్లు పడ్డాయి. 5,719 ఓట్ల మెజారిటీతో తెల్లం వెంకట్రావు విజయం సాధించారు. 2018 ఎన్నికల కంటే ఈ సారి 17,295 ఓట్లను మెరుగుపర్చుకున్నారు. పొదెం వీరయ్యకు 2018లో 47,746 ఓట్లు రాగా ఈ ఎన్నికలలో 47,533 ఓట్లు లభించాయి. అంటే గత ఎన్నికలకూ ఇప్పటికీ ఆయన ఓటు బ్యాంక్‌లో పెద్ద మార్పు ఏమీ లేదు. కానీ సీపీఎంకు చెందిన గత ఓట్లు అత్యధికంగా బీఆర్ఎస్ వైపుకు మళ్లడంతో తెల్లంకు మెజారిటీ పోలైంది. ముఖ్యంగా దుమ్ముగూడెం తెల్లం వెంకట్రావు సొంత మండలం కావడంతో ఇక్కడ సీపీఎం ఓట్లన్నీ మూకుమ్మడిగా వెంకట్రావ్‌కే పడినట్లు తెలుస్తోంది.

రౌండ్ల వారీగా..

భద్రాచలం నియోజకవర్గ ఫలితాలను మొత్తంగా 13 రౌండ్లలో లెక్కించారు. వరుసగా మొదటి, రెండవ, మూడవ, నాలుగవ, ఐదవ, ఆరవ రౌండ్లలో 126, 397, 218, 58, 856, 827 ఓట్లతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొదెం వీరయ్య ఆధిక్యంలో నిలిచారు. ఆ తరువాత వరుసగా ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది, పదకొండు, పన్నెండు, పదమూడు 306, 2353, 3440, 5155, 5421, 6277, 6319 ఓట్లతో బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావ్ ఆధిక్యంలో కొనసాగారు. తొలి ఆరు రౌండ్లలో పొదెం వీరయ్యకు అతి స్వల్ప ఆధిక్యాలు రాగా, ఆ తరువాత ఏడు రౌండ్లలో తెల్లం వెంకట్రావ్‌కు భారీ మెజార్టీ లభించింది. దీంతో వెంకట్రావ్ విజయం భద్రాచలంలో ఖాయమయింది. బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం, బీజేపి కాకుండా పోటీ చేసిన ఇతర పార్టీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు, నోటాతో కలిపి మొత్తం 9523 ఓట్లను సాధించారు. పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్‌కు 776, బీఆర్ఎస్‌కు 280, సీపీఎంకు 51, బీజేపీకి 15, నోటాకు 06, ఇతర అభ్యర్థులు, ఇండిపెండెంట్‌లకు 36 ఓట్లు లభించాయి.

ఐదో స్థానానికి బీజేపీ..

భద్రాచలం నియోజకవర్గంలో బీజేపి ఐదో స్థానానికి పడిపోయింది. 2018 ఎన్నికలలో ఆ పార్టీ తరుపున కుంజా సత్యవతి 1824 ఓట్లతో నాలుగో స్థానంలో నిలువగా, ఈ ఎన్నికలలో ఆమె మరణించటంతో ఆమె తరుపున సత్యవతి భర్త కుంజా ధర్మాకు ఆ సీటును కేటాయించారు. ఈ ఎన్నికలలో కుంజా ధర్మ 1931 ఓట్లు సాధించి ఐదో స్థానంలో నిలిచారు.

అభ్యర్థుల వారీగా..

ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావుకు 53,252 ఓట్లు పోలవగా.. కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్యకు 47,533 ఓట్లు పడ్డాయి. సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్యకు 5,860, ఇండిపెండెంట్ అభ్యర్థి మర్మం తిరుపతమ్మకు 2,083, బీజేపీ అభ్యర్థి కుంజా ధర్మారావుకు 1,931, మరో ఇండిపెండెంట్ అభ్యర్థి నక్కా సాయిబాబుకు 1,327, బీఎస్పీ అభ్యర్థి ఇర్పా రవికుమార్‌కు 1,303, ఇండిపెండెంట్ అభ్యర్థి ఉబ్బా సీతారాములుకు 823, గోండ్వానా దండకారుణ్య పార్టీకి చెందిన చింతా అరుణకు 725, ఇండిపెండెంట్ అభ్యర్థి పంద్రా హేమసుందర్‌కు 588, ధర్మ సమాజ్ పార్టీకి చెందిన రవ్వా భద్రమ్మకు 395, విద్యార్థుల రాజకీయ పార్టీకి చెందిన మడకం మిత్రకు 331, భారత చైతన్య యువజన పార్టీకి చెందిన పూనెం ప్రదీప్ కుమార్‌కు 306 ఓట్లు పోలవగా.. నోటాకు 1672 ఓట్లు పడ్డాయి.

పినపాక నియోజకవర్గంలో..

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు విజయం సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావుకు 56,004 ఓట్లు పోలవగా.. పాయంకు 90,510 ఓట్లు పడ్డాయి. అంటే 34,506 ఓట్ల మెజారిటీలో పాయం వెంకటేశ్వర్లు గెలుపొందారు. 2,627 ఓట్లతో బీజేపీ అభ్యర్థి పొడియం బాలరాజు మూడో స్థానంలో నిలిచారు.

రౌండ్‌ల వారిగా..

ఎన్నికల ఫలితాల్లో 1వ రౌండ్‌లో కాంగ్రెస్‌కు 6,338, బీఆర్ఎస్‌కు 3,142 ఓట్లు నమోదయ్యాయి. 2వ రౌండ్‌లో కాంగ్రెస్ 12,159, బీఆర్ఎస్ 5,951, 3వ రౌండ్‌లో కాంగ్రెస్ 18,422, బీఆర్ఎస్ 9,774, 4వ రౌండ్‌లో కాంగ్రెస్ 22,538, బీఆర్ఎస్ 12, 964, 5వ రౌండ్‌లో కాంగ్రెస్ 26,845, బీఆర్ఎస్ 16,703, 6వ రౌండ్‌లో కాంగ్రెస్ 32,488, బీఆర్ఎస్ 19,717, 7వ రౌండ్‌లో కాంగ్రెస్ 37,085, బీఆర్ఎస్ 22,773 ఓట్లు పొందాయి. ఇక 8వ రౌండ్‌లో కాంగ్రెస్ 41,716, బీఆర్ఎస్ 25,143, 9వ రౌండ్ కాంగ్రెస్ 47,195, బీఆర్ఎస్ 27,659, 10వ రౌండ్‌లో కాంగ్రెస్ 52,119, బీఆర్ఎస్ 30,181, 11వ రౌండ్ కాంగ్రెస్ 57,745, బీఆర్ఎస్ 34,297, 12వ రౌండ్‌లో కాంగ్రెస్ 62,435, బీఆర్ఎస్ 37,178 ఓట్లు నమోదయ్యాయి. 13కు వచ్చే సరికి కాంగ్రెస్ 67,884, బీఆర్ఎస్ 40,357, 14వ రౌండ్‌లో కాంగ్రెస్ 72,999, బీఆర్ఎస్ 44,069, 15వ రౌండ్‌లో కాంగ్రెస్ 74,449, బీఆర్ఎస్ 46,654, 16వ రౌండ్‌లో కాంగ్రెస్ 82,265, బీఆర్ఎస్ 50,843, 17వ రౌండ్ కాంగ్రెస్ 88,260, బీఆర్ఎస్ 54,903, 18వ రౌండ్‌లో కాంగ్రెస్ 89,893, బీఆర్ఎస్ 55,764 ఓట్లు కైవసం చేసుకున్నారు. ఇక పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్‌కు 617 ఓట్లు పోలవగా.. బీఆర్ఎస్ 240 పోలయ్యాయి.

అశ్వారావుపేట నియోజకవర్గంలో..

అశ్వారావుపేట: అశ్వారావుపేట నియోజకవర్గానికి నమోదయిన ఓట్ల లెక్కింపులో ఆదివారం ఆసక్తికరమైన ఫలితాలు వెల్లడయ్యాయి. 14రౌండ్‌లలో ఒక్కో రౌండ్‌కు 14 టేబుళ్లపై నిర్వహించిన కౌంటింగ్‌తోపాటు పోస్టల్ బ్యాలెట్‌తో సహా కాంగ్రెస్ అభ్యర్థి జారె ఆదినారాయణ అధికార పార్టీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుపై ప్రతి రౌండ్‌లోనూ అధిక్యత సాధించారు. రౌండ్‌ల వారిగా మెజారిటీ పెరుగుతుండటంతో కౌంటింగ్ కేంద్రం నుంచి కొందరు ఏజెంట్‌లు, నాయకులు కనుమరగయ్యారు. మొత్తంగా బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావుకు 46,088 ఓట్లు నమోదవగా.. కాంగ్రెస్ అభ్యర్థి జారె ఆదినారాయణకు 74,993 ఓట్లు పడ్డాయి. అనగా 28,905 ఓట్ల మెజారిటీతో జారె ఆదినారాయణ గెలుపొందారు.



మణుగూరులో పాయం వెంకటేశ్వర్లు విజయకేతనం

రౌండ్ల వారిగా..

మొదటి రౌండ్‌లో కాంగ్రెస్‌కు 4,911, బీఆర్ఎస్‌కు 2,966 ఓట్లు పోలయ్యాయి. రెండో రౌండ్‌లో కాంగ్రెస్‌కు 4,970, బీఆర్ఎస్‌కు 3,352, మూడో రౌండ్‌లో కాంగ్రెస్ 5,621, బీఆర్ఎస్ 4,087, నాలుగో రౌండ్‌లో కాంగ్రెస్ 6,080, బీఆర్ఎస్ 3,617 ఓట్లు పొందాయి. 5 నుంచి 9 రౌండ్లలో కాంగ్రెస్ వరుసగా 4,552, 6,292, 6,087, 5,785, 6,029 ఓట్లు సాధిస్తే.. బీఆర్ఎస్‌కు 3,998, 3,810, 3,607, 3,536, 3,429 ఓట్లు పోలయ్యాయి. ఇక 10 నుంచి 14 రౌండ్లలో కాంగ్రెస్‌కు వరుసగా 6,195, 5,620, 6,087, 5,153, 800 ఓట్లు పోలవగా.. బీఆర్ఎస్‌కు 3,328, 3,386, 3,607, 3,330, 472 ఓట్లు నమోదయ్యాయి. మరోవైపు పోస్టల్ బ్యాలెట్ విషయానికొస్తే.. కాంగ్రెస్‌కు 573, బీఆర్ఎస్‌కు 125 ఓట్లు పోలయ్యాయి.

అభ్యర్థుల వారిగా..

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి 14 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా.. కాంగ్రెస్ అభ్యర్థి జారే ఆదినారాయణకు 74,993, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావుకు 46,088 ఓట్లు నమోదయ్యాయి. సీపీఎం అభ్యర్థి పిట్టల అర్జున్‌కు 2,488, బీఎస్పీ అభ్యర్థి మడకం ప్రసాద్‌కు 1580, బీజేపీ-జనసేన అభ్యర్థిని ముయ్యబోయిన ఉమాదేవికు 2,281, బీసీవై పార్టీ అభ్యర్థి మనుగొండ వెంకట ముత్యంకు 678, సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా అభ్యర్థి కల్లూరి కిషోర్‌కు 1,907, స్వతంత్ర అభ్యర్థులు వూకే రవికు 857, కన్నెబోయిన వెంకట నరసింహకు 178, పద్దం వెంకట రమణకు 1754, అంగోతు కృష్ణకు 232, వూకే ముక్తేశ్వరరావుకు 419, కుంజా నాగమణికు 484, తంబాల రవికి 922 చొప్పున ఓట్లు వచ్చాయి.

గెలుపోటములు సహజం: పొదెం వీరయ్య

భద్రాచలంటౌన్: రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని భద్రాచలం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొదెం వీరయ్య అన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలం నియోజకవర్గ ప్రజల తీర్పును స్వాగతిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నేను ఓడిపోయిన రాష్ట్రంలో మా పార్టీ అధికారంలో ఉంది కాబట్టి భద్రాద్రి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు సరెళ్ళ నరేష్, బుడగం శ్రీనివాస్, సతీష్, సత్యలింగం తదితరులు పాల్గొన్నారు.

లెక్కింపు వద్ద కనిపించని మెచ్చా

అశ్వారావుపేట: ఎన్నికల్లో ప్రధాన పోటీదారుగా ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు లెక్కింపు జరుగుతున్న వేళ ఒక్కరి కంటికీ కనిపించలేదు. ఓటమి గురించి ముందే తెలుసునో.. గెలిచే స్తామనే అతివిశ్వాసమో.. గెలిచిన తర్వాత వెళదాంలే అని ఆగారో గానీ.. నాకు కానరాలేదంటే నాకు కానరాలేదంటూ కౌంటింగ్ కేంద్రం వద్ద ఉన్న సిబ్బంది, ఏజెంట్లు, మీడియా ప్రతినిధులు చెప్పుకుంటున్నారు. ఎన్నికల ప్రచారానికి సైతం ఆలస్యంగా బయలుదేరేవారని.. మనకు కాకుంటే ఓట్లెవరికి పడతాయనే ధీమాను వ్యక్తం చేసేవారనే ప్రచారముంది. లెక్కింపు రోజు కూడా అదే అతివిశ్వాసాన్ని ప్రదర్శించారా అని స్థానికులు చర్చించుకున్నారు.

ఫలించని 'రేగా' ఆశలు

మణుగూరురూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని ఆశలు పెట్టుకున్న పినపాక బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రేగా కాంతారావు.. ఆదివారం కౌంటింగ్ కేంద్రం నుంచి నిరుత్సాహంగా వెనుదిరిగారు. ఆది నుంచి తన గెలుపు ఖాయమని, భారీ మెజార్టీ కోసమే తన ప్రయత్నమని చెప్పిన రేగా కాంతారావుకు పరానుభవం ఎదురైంది. ఎన్నికల కౌంటింగ్‌లో తొలి రౌండ్ నుంచే సీపీఐ, టీజేఎస్, టీడీపీ, వైఎస్ఆర్‌టీపీలు బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లుకే స్పష్టమైన మెజార్టీ కనబరుస్తుండడంతో.. రేగా కాంతారావుతో పాటు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులు ఒక్కింత నిరుత్సాహానికి గురయ్యారు. రౌండ్ రౌండ్‌కూ బీఆర్ఎస్ ఓట్ల మెజార్టీ పెరుగుతుందని ఆశించినప్పటికీ ప్రతీ రౌండ్‌లో కూడా కాంగ్రెస్ అభ్యర్థి పాయానికి ఆధిక్యం పెరుగుతూ వచ్చింది. దీంతో బిఆర్ఎస్ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది. సుమారు 14 రౌండ్ల వరకు కౌంటింగ్ ముగిసే సరికి పాయం వెంకటేశ్వర్లు 28,930 ఓట్ల మెజార్టీతో ఆధిక్యంలో ఉండడంతో ఇక బీఆర్ఎస్ అభ్యర్థి, పార్టీ శ్రేణులు ఆశలు వదులుకున్నారు. మిగతా రౌండ్లు పూర్తి కాకముందే రేగా కాంతారావు నిరుత్సాహంతో వెనుదిరిగారు. పినపాక ప్రజలు ఇచ్చిన తీర్పుతో బీఆర్ఎస్ శ్రేణుల్లో అసంతృప్తి నెలకొంది.

జారే ప్రయాణం సాగిందిలా..



కార్యకర్తలతో జారె ఆదినారాయణ..

అశ్వారావుపేట: ఓ మారుమూల ఆదివాసీ గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించి వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించిన జారే ఆదినారాయణ.. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పాల్గొన్నారు. అప్పటి టీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకుడు కేసీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడారు. హరీష్‌రావుతో సన్నిహితంగా ఉంటూ ఉద్యమాన్ని ఉధృతం చేశారు. తీరా తెలంగాణ వచ్చాక నిధులు.. నియామకాలు సరే కదా ఉన్న ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొన్నారు. ఆదినారాయణ 2014లో టీఆర్ఎస్ తరుపున అశ్వారావుపేట నియోజకవర్గ టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తన సతీమణి ప్రభుత్వ ఉద్యోగిణి కావడంతో కుటుంబ పోషణకు ఇబ్బంది లేకపోవడంతో ఆమె ప్రోత్సాహంతో నియోజకవర్గ ప్రజలకు టీఆర్ఎస్ పార్టీని చేరువ చేశారు. అందులో భాగంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పేదలకు అందించడంలో నిమగ్నమయ్యారు. అయినా 2014లో గెలిచిన తాటి వెంకటేశ్వర్లుకు 2018లో టికెట్, 2018లో గెలిచిన మెచ్చా నాగేశ్వరరావుకు ఉద్యమపార్టీ అధినేత టికెట్ ఇచ్చారే తప్ప ఆదినారాయణను విస్మరించారు. తీరా 2023లో సైతం సిట్టింగ్‌లకే టికెట్ అని సీఎం ప్రకటించడంతో జారె పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు. తనవలె భంగపాటుకు గురయిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆశ్రయించారు. నిజాయితీగా తన అడుగుజాడలలోనే నడుచుకుంటానని ప్రజల సమక్షంలో మాటిచ్చారు. జారే ఆదినారాయణ తన కష్టకాలంలో తన వెంట నడిచి వచ్చినందుకు టికెట్ సాధించడం కోసం పొంగులేటి అధిష్టానంతో చేసిన పోరు అందరికీ తెలిసిందే. ఏ పార్టీ కోసం తన ఉద్యోగాన్ని త్యజించారో.. ఆ పార్టీ అభ్యర్థిపైనే పోటీ జారే ఆదినారాయణ విజయం సాధించారు. చిరునవ్వుతో పలకరించడం, సీఎం రిలీఫ్ ఫండ్‌ల కోసం సమయాన్ని కేటాయించడం, గిరిజన, గిరిజనేతర ప్రజల్లో ప్రతి శుభ, అశుభ కార్యక్రమాలకు సొంతింటి వాడిలా హాజరు కావడంతోపాటు గతంలో నియోజకవర్గంలోనే పాఠశాలలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేయడం వంటి అంశాలు అనుకూలించాయి.

పార్టీ శ్రేణుల విజయోత్సాహం

ఎన్నికల ఫలితాలు వెలువడడంతో అశ్వారావుపేట, పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లోని గెలుపొందిన ఆయా అభ్యర్థుల అనుచరులు, పార్టీ శ్రేణులు ఆదివారం సంబురాలు చేసుకున్నారు. కేక్ కట్‌చేసి, స్వీట్లు పంచిపెట్టారు. బాణసంచా కాల్చి నినాదాలు చేశారు. జెండాలు చేతబట్టి వీధుల్లో ర్యాలీలు తీశారు. కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం నుంచే విజయోత్సవ కొలాహలం కనిపించింది. మరోవైపు గెలుపొందిన అభ్యర్థులు కార్యకర్తలతో కలిసి సందడి చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



మణుగూరుటౌన్: ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటున్న అభిమానులు, నాయకులు



ములకలపల్లిలో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



అశ్వారావుపేటరూరల్: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



దుమ్ముగూడెం: సంబురాలు జరుపుకుంటున్న కొత్తపల్లి గ్రామస్తులు



అన్నపురెడ్డిపల్లి: బాణసంచా కాలుస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

మన్యంలో బీఆర్ఎస్ పాగా

భద్రాచలం/భద్రాచలంఅర్బన్: భద్రాచలం మన్యంలో బీఆర్ఎస్ తొలిసారి పాగా వేసింది. హోరాహోరీగా సాగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావ్ కారు గుర్తు జెండాను ఎగురవేసి తన దశాబ్దపు కలను ఎట్టకేలకు నెరవేర్చుకున్నారు. కౌంటింగ్‌లో తొలి ఆరు రౌండ్‌లు పొదెం వీరయ్యకు స్వల్ప మెజారిటీ ఉండగా, అనంతరం 7 రౌండ్‌లు తెల్లం వెంకట్రావ్‌పై చేయిను సాధించారు. ప్రధానంగా దుమ్ముగూడెం మండలంలో లెక్కింపు జరిగిన రౌండ్‌లో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించారు. రౌండ్ రౌండ్‌కూ ఉత్కంఠగా సాగిన ఓటింగ్‌లో 'విజేత'గా నిలిచారు. రాష్ట్రమంతటా కాంగ్రెస్ హవా కొనసాగగా ఇక్కడ తెల్లం బీఆర్ఎస్ జెండా ఎగురవేశారు. భద్రాచలం నియోజకవర్గంలో 17వ ఎమ్మెల్యేగా తెల్లం వెంకట్రావ్ స్థానం సంపాదించారు.

రాజకీయ ప్రస్థానం ఇలా..

తొలిసారిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో వెంకట్రావ్ తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ పార్టీ తరుపున మొదట మహబూబాబాద్ ఎంపీ స్థానానికి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఓటమి అనంతరం మారిన రాజకీయ పరిణామాల నడుమ బీఆర్ఎస్ పార్టీలో చేరి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా, రాష్ట్ర కమిటీ ప్రతినిధిగా సేవలను అందించారు. అనంతరం 2018లో ఎన్నికలలో పోటీ చేయగా కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య చేతిలో ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్న సమయంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మారారు. పొంగులేటి అనుచరుడిగా ముద్ర వేసుకున్న వెంకట్రావ్‌కు ఈ సమయంలోనే హార్ట్ సర్జరీ జరిగింది. కోలుకున్న అనంతరం పొంగులేటితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఇక్కడ సీట్ సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు కేటాయించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రాత్రికి రాత్రే బీఆర్ఎస్ అధిష్టానం కేసీఆర్, కేటీఆర్‌లను కలిసి భద్రాచలం అసెంబ్లీ స్థానాన్ని పొందారు. ఇదే వెంకట్రావ్‌కు 'టర్నింగ్ పాయింట్'గా నిలిచింది. అనంతరం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ తాతా మధు భద్రాచలంకు ఇంఛార్జ్‌గా వ్యవహరించిన ఈ ఎన్నికలలో విజేతగా నిలిచారు. ఇలా తెలంగాణ అసెంబ్లీలో భద్రాచలం ఎమ్మెల్యేగా పాదం మోపాలన్న తన దశాబ్దపు కలను ఎట్టకేలకు ముచ్చటగా మూడోసారి పోటీ చేసి సాకారం చేసుకున్నారు.



కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకుంటున్న తెల్లం వెంకట్రావ్ (ఫైల్)

పనిచేసిన 'స్థానికత మంత్రం'

భద్రాచలంలో తెల్లం వెంకట్రావ్ గెలుపులో స్థానికత మంత్రం అధికంగా పనిచేసింది. వివిధ మండలాల్లో వెంకట్రావ్ సాధించిన ఓట్లతో ఇది రుజువయింది. ఎన్నికల ప్రచారంలో సైతం స్థానిక అభ్యర్థిగా మీకు అండగా ఉంటా.. గెలిపించండి అంటూ స్థానికతనే ప్రధాన అస్త్రంగా వాడారు. వాజేడు, వెంకటాపురం, చర్ల మండలాల్లో కొద్దిగా వెనుకబడినప్పటికీ ఆయన సొంత మండలాలైన దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల్లో ఈ స్థానికత బాగా పనిచేసింది. దుమ్ముగూడెం మండలంలో స్పష్టమైన ఆధిక్యతతో పోటీలో ముందు నిలువగా భద్రాచలంలో సైతం అదే ఆధిక్యాన్ని నిలబెట్టుకున్నారు. ప్రధానంగా భద్రాచలం మండల ప్రజలు సైతం అభివృద్ధి కోసం వెంకట్రావ్‌కు అండగా నిలబడ్డారు. దీంతో స్థానిక అభ్యర్థిగా వెంకట్రావ్ గెలుపొందారు. స్థానికతకు తోడుగా బీఆర్ఎస్ ఎన్నికలకు ముందు రెండు రోజుల 'పోల్ మేనేజ్‌మెంట్'ప్రణాళిక కూడా సత్ఫలితాలను ఇచ్చింది. అయితే భద్రాచలంలో బీఆర్ఎస్ గెలిచినప్పటికీ రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి రాకపోవడం ఒక్కటే ఆయనకు వెలితిగా మారింది.

'పొదెం' ఓటమికి కారణాలేంటి?

- దెబ్బతీసిన అనుచరగణం, దళితబంధు మచ్చ
- స్థానిక నాయకుడి వైపు ప్రజల మొగ్గు

భద్రాచలం: 2018 ఎన్నికల్లో కేవలం పదిహేను రోజుల ముందు భద్రాచలం వచ్చిన పొదెం వీరయ్యకు బ్రహ్మరథం పట్టిన భద్రాచలం నియోజకవర్గ ప్రజలు.. 2023 ఎన్నికల్లో వినూత్నమైన తీర్పును ఇచ్చారు. 2018 ఎన్నికలలో ప్రత్యర్థి తెల్లం వెంకట్రావ్‌పై 11,785 ఓట్ల తేడాతో గెలిచిన పొదెం వీరయ్య 2023 ఎన్నికల్లో అదే ప్రత్యర్థి వెంకట్రావ్ చేతిలో 5,755 ఓట్ల తేడాతో ఓటమి పొందారు. ఇందుకు బలమైన కారణాలు లేకపోలేదు.

మాయని మచ్చ..

కర్ణుడి చావుకు వంద కారణాలు అన్నట్లుగా పొదెం వీరయ్య ఓటమిలో సైతం అనేక కారణాలు ఉన్నట్లుగా విశ్లేషకులు భావిస్తున్నారు. నిజాయితీ, నిబద్ధకు మారుపేరుగా, రాష్ట్రంలో గెలిచిన ఎమ్మెల్యేలందరూ బీఆర్ఎస్ వైపు మారినప్పటికీ భద్రాచలం ప్రజల విశ్వాసం మేరకు కాంగ్రెస్ పార్టీలోనే వీరయ్య కొనసాగారు. అయితే అనేక ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడిన పొదెం వీరయ్యకు 'దళిత బంధు'పథకంలో అవినీతి మాయని మచ్చగా నిలిచింది. అనేక మండలాల్లో ఆయన అనుచరగణం బహిరంగంగానే దళితబంధు యూనిట్లను అమ్మకానికి పెట్టారు. రెండో విడతకు సైతం అడ్వాన్స్‌గా లబ్ధిదారుల వద్ద నుంచి డబ్బులు తీసుకున్నట్లు ప్రచారం అయింది. ఈ విషయం పార్టీ వద్దకు చేరడం, ప్రత్యర్థి విమర్శలకు బలం చేకూర్చడంతో.. అడ్వాన్సుగా తీసుకున్న డబ్బును లబ్ధిదారులకు తిరిగి ఇచ్చేశారు. కాని అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ప్రజల్లో వ్యతిరేక పవనాలు అప్పటికే వీచాయి.



కౌంటింగ్ మధ్యలోనే కేంద్రం నుంచి బయటికి వెళ్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వీరయ్య

పోల్ మేనేజ్‌మెంట్‌లో విఫలం..

ఇక ఆయన అనుచరగణం వ్యవహార శైలి మరో నష్టదాయకంగా మారింది. వెంకటాపురం, వాజేడు మండలాల్లో ప్రచారంపై అనుచరులు దృష్టి పెట్టకపోవడంతో గత ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కంటే తక్కువగా ఓట్లు నమోదయ్యాయి. ఇక దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల్లో 'పోల్ మేనేజ్‌మెంట్'లో పూర్తిగా వైఫల్యమయ్యారనే విమర్శలు ఉన్నాయి. భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో ద్వితీయ శ్రేణి నాయకులు ప్రజలకు అందించాల్సిన 'ఫలాలను'తమ ఖాతాలో వేసుకోవడం మరో తీవ్ర నష్టంగా కనబడుతుంది. గత ఎన్నికల్లో పొదెంకు అండగా నిలిచిన భద్రాచలం మండలంలో ఓటింగ్ శాతం తక్కువగా నమోదు కావడం కూడా మరో కారణంగా చెప్పుకోవచ్చు. దుమ్ముగూడెం, చర్ల, వాజేడు, వెంకటాపురం మండలాల్లో 80 శాతం ఓటింగ్ నమోదయితే, భద్రాచలం మండలంలో మాత్రం అది కేవలం 60 శాతంగా ఉంది. గత ఎన్నికల్లో భద్రాచలం మండలంలో పొదెంకు అండగా నిలిచిన ప్రజలు ఈ ఎన్నికలలో మాత్రం బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు సమానంగా నిలిచారు. దీనికి తోడు బీఆర్ఎస్ పార్టీ తరుపున తెల్లం వెంకట్రావ్ రెండు నెలలు ముందుగానే ప్రచారం ప్రారంభించటం, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ప్రకటన ఆలస్యంతో పొదెం వీరయ్య ప్రచారం సైతం ఆలస్యంగా జరగటం మరో కారణంగా పలువురు అభిప్రాయపడుతున్నారు. దీనికి తోడు భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల స్థానిక వాసిగా వెంకట్రావ్‌కు ఆదరణ చూపడంతో పొదెం వీరయ్య ఈ ఎన్నికల్లో రెండో స్థానానికే పరిమితమయ్యారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.
కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ -79979 58226 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24
మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416